- ఆ సమయంలో మీరిచ్చిన ధైర్యంతోనే ఇలా నిలబడ్డాం
- నిజం గెలవాలి పర్యటనలో నారా భువనేశ్వరి ఉద్వేగం
- వేపకుంట, పోలేపల్లిలో కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- పూలవర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్న టీడీపీ శ్రేణులు

ప్రాణం ఉన్నంతవరకూ అండగా ఉంటాం

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 14: ప్రాణం ఉన్నంతవరకు టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె కనగానపల్లి, రామగిరి మండలాల్లో బుధవారం పర్యటించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో తీవ్ర మనోవేదనతో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. వేపకుంట గ్రామ టీడీపీ కార్యకర్త బెస్త నారాయణ కుటుంబాన్ని ఓదార్చారు. గత ఏడాది సెప్టెంబరు 15న బెస్త నారాయణ గుండెపోటుతో మరణించారు. దీంతో బాధిత కుటుంబానికి ఆమె రూ.3 లక్షల చెక్కును అందించారు. నారా భువనేశ్వరిని చూడగానే నారాయణ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. కన్నీటిపర్యంతమైన వారిని భువనేశ్వరి ఓదార్చారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. 'ఆ రోజు మీరిచ్చిన ధైర్యంతోనే మేము ఇప్పుడు ఇలా నిలబడ్డాం. మా ప్రాణం ఉన్నంత వరకు మీరు మాపై చూపిన ప్రేమను మరవం' అని భువనేశ్వరి అన్నారు.



బెస్త నారాయణకు నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

చిన్నారి ముద్దు

అండగా మేము...

అడుగడుగునా నీరాజనం

ధర్మవరం నుంచి మామిళ్లపల్లి, కనగానపల్లి మీదుగా వేపకుంట గ్రామానికి భువనేశ్వరి వచ్చారు. మామిళ్లపల్లిలో నాయకులు, కార్యకర్తలు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. దాడి పొడవునా ఆమెపై పూలవర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. కనగానపల్లి నాలుగు రోడ్ల కూడలిలో జనం బారులుతీరారు. గ్రామగ్రామాన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూలు చల్లుతూ, హారతి పడుతూ స్వాగతించారు. వారందరికీ భువనేశ్వరి అభివాదం చేస్తూ, కృతజ్ఞతలు తెలుపుతూ ముందుకు సాగారు.



పరిటాల ఘాట్ వద్ద నివాళి

కనగానపల్లి మండలం నుంచి రామగిరి మండలంలోకి భువనేశ్వరి అడుగు పెట్టగానే పేరూరులో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి ఆమె వెంకటాపురం గ్రామానికి చేరుకుని, పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పరిటాల రవీంద్ర టీడీపీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



వేపకుంట కార్యకర్త బెస్త నారాయణ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

మీరే నడిపిస్తున్నారు..

రామగిరి మండలం పోలేపల్లి గ్రామ టీడీపీ కార్యకర్త వెంకటరాముడు గత ఏడాది సెప్టెంబరు 13న మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి, రూ.3 లక్షల చెక్కును అందించారు. వారి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పోలేపల్లిలో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తలే పార్టీకి కొండంత బలమని అన్నారు. కార్యకర్తలను ఎన్నటికీ మరువబోమని అన్నారు. 'మీరు ధైర్యం, సాహసం ప్రదర్శించి.. మమ్మల్ని ముందుండి నడిపిస్తున్నారు..' అని ఉద్వేగంగా మాట్లాడారు. మహిళల కోసం చంద్రబాబు నాయుడు ఎన్నో పథకాలు తెచ్చారని, మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. పార్టీ జెండాను పట్టుకుని, అందరం ధైర్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. 'మన ఆయుధం ఓటు. ఓటును ఎవరూ మరువకూడదు. మీ ఓటు జాబితాలో ఉందో.. తొలగించారో జాగ్రత్తగా గమనించాలి. ఓటుతోనే వైసీపీకి బుద్ధి చెప్పాలి..' అని సూచించారు.



పోలేపల్లి గ్రామ టీడీపీ కార్యకర్త వెంకటరాముడు కుటుంబానికి చెక్కు అందజేస్తూ..

భువనేశ్వరిపై పూలవర్షం..

ఎన్టీఆర్, చంద్రబాబు కుటుంబాలను మరువం: పరిటాల సునీత

పరిటాల రవీంద్రను ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ఆహ్వానించారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. ఆ తరువాత చంద్రన్న రాజకీయాలలో తమకు అధిక ప్రాధాన్యమిచ్చి గౌరవించారని అన్నారు. ప్రాణం ఉన్నంతవరకూ ఎన్టీఆర్, చంద్రబాబు కుటుంబాలను మరువమని అన్నారు. ఆమె ఎమ్మెల్సీ పంచమర్తి అనూరాధ, ధర్మవరంటీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ తదితరులు ఉన్నారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం: జేసీ



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 14: దామోదరం సంజీవయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలిదళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతిని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ఓ దళిత కుటుంబంలో జన్మించి. చిన్నవయసులోనే ముఖ్యమంత్రిగా ఎన్నికై ప్రజలకు సేవలందించి అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆ మహనీయుడి బాటలో అందరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, బీసీవెల్ఫేర్ డీడీ ఖుష్బూకొఠారి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై కాలవ ఆగ్రహం



కాలవకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 14: నియోజకవర్గంలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో తనను పాల్గొనకుండా చేయడంపై మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మఘట్టలో జరిగే ఆసరా కార్యక్రమంలో తాను పాల్గొనరాదంటూ బుధవారం ఉదయం పోలీసులు నోటీసు ఇవ్వడాన్ని ఆయన ఓ ప్రకటనలో తప్పుపట్టారు. ఆసరా కార్యక్రమంలో మహిళా సంఘాలకు ఏ ప్రభుత్వ పదవీ లేని మెట్టు గోవిందరెడ్డి ఏ ప్రొటోకాల్ ప్రకారం చెక్కులు ఎలా పంపిణీ చేస్తాడని ఆయన ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా మెట్టు గోవిందరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో అతిథిగా ఎలా పాల్గొంటున్నాడో సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 2004-09 మధ్య కాలంలో మెట్టు ఎమ్మెల్యేగా ఉంటే తాను 2014-19 ఎమ్మెల్యేగా ఉన్నానని తనని ఎందుకు ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదో వివరణ ఇవ్వాలని వెలుగు అధికారులను కోరానని స్పష్టం చేశారు. ఆహ్వానం అందించకపోగా తనకు పోలీసులు నోటీసులు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలకు ఒక గౌరవం, ప్రతిపక్షంలో ఉన్న వారిని మరోలా చూడటం సబబు కాదన్నారు. ప్రొటోకాల్ విషయంగా కలెక్టర్ స్పందించాలని కోరారు.

ఏమిటీ దుస్థితి..?

జీతాలు ఎప్పుడు పడతాయో తెలియడం లేదు

- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక వర్గాల ఆవేదన
- ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు



తాడిపత్రి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన



అనంతపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

అనంతపురం రూరల్/టౌన్, ఫిబ్రవరి 14: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే తమ ఆగ్రహానికి గురికాకతప్పదని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జేఏసీ పిలుపు మేరకు ఏపీఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆందోళనలు నిర్వహించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాలలో రెవెన్యూ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. నెలనెలా వేతనాలు ఎప్పుడు పడుతాయోనని ఎదుచూడాల్సి వస్తోందని అన్నారు. ఇలాంటి దుస్థితి ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పీఆర్సీ మధ్యంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లెయిమ్స్, 11వ పీఆర్సీ డీఏ, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 2004కు ముందు నోటిఫై తరువాత నియామకమైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని అన్నారు. అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. ఉపాధ్యాయులకు అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, పార్ట్, ఫుల్ టైమ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. జడ్పీలోని జూనియర్, రికార్డ్, ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, ఏపీపీడీఎస్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, నాయకులు మనోహర్‌రెడ్డి, పి.రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్న నమ్మకం ప్రజల్లో ఉందని జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా, ఆ నమ్మకాన్ని మరింత బలపరచాలని డ్రైవర్లకు ఆయన సూచించారు. అనంతపురం డిపో ఆవరణలో రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని అధ్యక్షతన బుధవారం నిర్వహించిన 35వ రోడ్డుభద్రతా వారోత్సవాల ముగింపు సభకు ఆర్టీఓ సురేష్, ఏఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా ఎనిమిది వేల మందికి పైగా చనిపోతున్నారని అన్నారు. మరో 25 వేలమందికి పైగా గాయపడుతున్నారని అన్నారు. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఆర్టీసీ బస్సుల ప్రమాదాలు చాలా తక్కువ అని అన్నారు. డ్రైవర్లకు ఆర్టీసీ ఇచ్చే నైపుణ్యమైన శిక్షణే దీనికి కారణమని అభినందించారు. ఉదయం బస్సు ఎక్కే డ్రైవర్, సాయంత్రం బస్సుదిగి ఇంటికి వెళ్లేవరకూ రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అపుడే ప్రమాదాలను సంపూర్ణంగా నియంత్రించగలమని అన్నారు. నిద్రలేమి, అతివేగం, నిర్లక్ష్యం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్ల అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వీటిపట్ల ప్రతి డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చడమే ప్రధాన కర్తవ్యంగా భావించాలని సూచించారు. జిల్లాలో రోజురోజుకీ వాహనాల సంఖ్య పెరుగుతోందని, దీంతోపాటు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆర్టీఓ సురేష్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటేతప్ప ప్రమాదాలను నివారించలేమని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఓ చెంద్రాయుడు, డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్, తాడిపత్రి డీఎం జీఎల్ శంకర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ వినయ్, బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, పాల్గొన్న డ్రైవర్లు

డ్రైవర్లకు అవార్డులు

రీజియన్ స్థాయిలో జీకె మొహిద్దీన్(అనంతపురం), వీఎస్ఎస్ వలి(తాడిపత్రి), బీఆర్ ఆంజనేయులు(అనంతపురం) అవార్డులు అందుకున్నారు.

డిపోలవారీగా..

అనంతపురం డిపో నుంచి ఎస్ఎం బాషా, జేఎస్ రాములు, బి లోకయ్య, గుంతకల్లు నుంచి బి.బాలస్వామి, వైకే మూర్తి, హెచ్‌కే పీరా, గుత్తి డిపో పరిధిలో కె.రాజు, బి.ఈరన్న, యస్ ఉస్మాన్, కల్యాణదుర్గంలో జి. వెంకటేష్, టీవీ రమణ, ఎస్ఆర్ క్రిష్ణ, రాయదుర్గంలో వి.శేఖర్, డీజీ నాయక్, పి.రామాంజిని, తాడిపత్రిలో బి.శంకర్, కేవీ రాముడు, యం.ప్రసాద్, ఉరవకొండలో బీఎల్ నారాయణ, జె.గంగన్న, యం.శివప్రసాద్ అవార్డులను అందుకున్నారు.

విద్యుత్ సమస్యలపై రైతుల ఆగ్రహం

సబ్‌స్టేషన్ ముట్టడి



గుమ్మఘట్ట సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 14: వేళపాళ లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పలువురు రైతులు బుధవారం ఉదయం ముట్టడించారు. రెండు నెలల క్రితం సబ్‌స్టేషన్ పరిధిలో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేసేవారని, తర్వాత కొద్దిరోజులు 9 గంటలు సరఫరా చేశారన్నారు. దీంతో రైతులంతా ఎక్కువ పొలాన్ని సాగు చేసినట్లు వెల్లడించారు. అయితే గత వారంరోజులుగా ఏడు గంటలే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటలకు నీటి తడులు ఇవ్వలేకపోతున్నామని పేర్కొన్నారు. అలాగే వేళాపాళా లేకుండా రాత్రి నాలుగు గంటలు, పగలు మూడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఎప్పుడు కరెంటు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక పొలాల వద్దే వేచి ఉంటున్నట్లు తెలిపారు. రైతులకు నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సబ్‌స్టేషన్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో రైతుల పరిస్థితుల గమనించి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో కోనాపురం, గుమ్మఘట్ట, గోనబావి గ్రామాలకు చెందిన దాదాపు 30 మంది రైతులు పాల్గొన్నారు

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

కేంద్ర పథకాలపై సీఎం జగన్ బొమ్మలా?



ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో అమలవు తున్న పథకాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఫొటోలు వేసుకుని ప్రచారం చేసుకుంటున్నాడని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విమర్శించా రు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. అంతకుమునుపు అనంతపురం రహదారి నుంచి క్లాక్ టవర్ వరకూ వాల్మీకి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో ఆటో, బైక్ ర్యాలీ నిర్వహించారు. క్లాక్‌టవర్ కూడలిలో గజమాలతో సత్యకుమార్‌ను సత్కరించారు. అనంతరం సురేంద్ర బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ హవా నడుస్తోందన్నారు. 10ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజల ఆకాంక్షలకు సంక్షేమానికి పెద్దపీటవేసినట్లు వివరించారు. రాష్ట్రంలో సీఎం జగన్ పేదలకు ఇళ్లు నిర్మించడు కానీ, తాడేపల్లి, రుషికొండలో మాత్రం ఏడాదిలోనే పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తాడని విమర్శించారు. ఉద్యానపంటలకు కేంద్రం సబ్సిడీతో రూ.2500కోట్లు ఇస్తే, రూ.250కోట్లు మాత్రమే ఖర్చు చేశాడని, మిగతా డబ్బు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రాజెక్టులు పూర్తి అయ్యింటే రాయలసీమ సస్యశ్యామలం అయ్యేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందిరెడ్డి శ్రీనివాసులు, లలిత్‌కుమార్, లక్ష్మీనారాయణ, రాజేష్, మాలపాటి హరి, బీజేవైఎం నాయకులు రమేష్, సురేష్, బాలకృష్ణ, పాల్గొన్నారు.





రాట్నం తిప్పుతున్న నారా భువనేశ్వరి



ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



స్వాగతం పలుకుతున్న మహిళలు

ధర్మవరం పట్టుచీర గొప్పతనం తెలుసు

● నారా భువనేశ్వరి ● చేనేత మహిళలతో ముఖాముఖి



ధర్మవరం, ఫిబ్రవరి 14: 'ధర్మవరం చేనేత పట్టుచీరకు 125 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ తయారుచేసే రక్షాబంధన్, సంపంగి, పుష్పవల్లి, రంగవల్లి పట్టుచీరల గురించి తెలుసు. ధర్మవరం చేనేత గొప్పతనం తెలియజేయడానికి పద్మవర్షిణి పట్టుచీర ఒక్కటి చాలు' అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ధర్మవరం చేనేతకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. అంతటి ప్రాశస్త్యం ఉన్న చేనేతకు అండగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం ధర్మవరంలోని మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణమండపంలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో చేనేత మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను చేనేత మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత మహిళలు చీర తయారీకి అవసరమయ్యే పరికరాలు, ముడిపదార్థాలను భువనేశ్వరికి క్షేత్రస్థాయిలో చూపించారు. వీటి ద్వారా వస్త్రాల తయారీ, మార్కెట్‌కు తరలింపును వివరించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ అభివృద్ధికి మొదటి నుంచి కృషిచేస్తున్న పార్టీ టీడీపీ అన్నారు. చంద్రబాబు పాలనలో చేనేతలకు గుర్తింపుకార్డులు ఇచ్చి రూ.50వేల వరకు సబ్సిడీలు అందించి, ఆదుకున్నారన్నారు. నూలుమీద సబ్సిడీని 10 శాతం నుంచి 40 శాతానికి పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చేనేతలకు పనులులేని సమయంలో కార్మిక భృతి ఇచ్చి ఆదుకున్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు ప్రతినెలా పెన్షన్ ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చేనేతలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. గతంలో చేనేతలకు చంద్రబాబునాయుడు అందించిన పథకాలను పునరుద్ధరిస్తారన్నారు. చేనేతలకు ఇప్పటికే చంద్రబాబు కొన్ని హామీలు ఇచ్చారన్నారు. మగ్గం ఉన్న చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తారన్నారు. మరమగ్గాల వారికి 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వనున్నారన్నారు. ముడిసరుకు కొనుగోలుకు రాయితీలతోపాటు రుణాలను మంజూరు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేసేలా చర్యలు తీసుకోవడం, కేంద్రం ఒప్పుకోకపోతే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. చేనేతలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో కామన్ వర్కింగ్ షెడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు రూ.10లక్షలు పరిహారం అందిస్తారన్నారు. చేనేత పరిశ్రమలో మహిళల భాగస్వామ్యం చాలా అవసరమన్నారు. పేదరికం.. ఆడపిల్లల చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్త్రీ విద్యకు ప్రాధాన్యతతో 1200 మందికి కుట్టుశిక్షణ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్, ఫుడ్‌పార్క్, పార్క్ మోబిస్ ఇండియా, హార్డ్‌వేర్ క్లస్టర్లు, స్మార్ట్‌సిటీ ఏర్పాటు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నారా లోకేశ్ పాదయాత్రలో మిషన్ రాయలసీమ డిక్లరేషన్ ఇచ్చారన్నారు. అనంతపురం జిల్లాను ఆటో మొబైల్ హబ్‌గా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో మహిళలు ఓటు అనే ఆయుధాన్ని దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దెదించడానికి వాడాలన్నారు.



పరిటాల శ్రీరామ్



ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ





హాజరైన సవిత, పరిటాల జ్ఞాన, శివబాల, చేనేత మహిళలు





చేనేత మహిళలతో ముఖాముఖి ఇలా..

పావని, చేనేత కార్మికురాలు: ధర్మవరం పట్టుచీరకు మంచి డిమాండ్ ఉంది. మీరు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటూ ప్రమోట్ చేస్తారా?

భువనేశ్వరి: తప్పకుండా చేస్తా. రాష్ట్రవ్యాప్తంగా చేనేతలు తయారుచేసే వస్త్రాలను ప్రమోట్ చేసే బాధ్యత తీసుకుంటా. ధర్మవరం, పోచంపాడు, వెంకటగిరి పట్టుచీరలకు చేతితో నేసిన చీరలనే ప్రమోట్ చేస్తా.

రాధ, చేనేత కార్మికురాలు: ధర్మవరం పట్టుచీర ధరించాలనే కోరిక లేదా?

భువనేశ్వరి: ధర్మవరం పట్టుచీరే కాదు పోచంపాడు, వెంకటగిరి ఇతర ప్రాంతాలకు చెందిన పట్టుచీరలు ధరించాలని కోరిక ఉంటుంది.

సాయిజ్యోతి, కార్మికురాలు: చంద్రబాబునాయుడు సారు.. భర్తగా మీకిష్టమైన పట్టుచీరను ఎప్పుడైనా తీసుకొచ్చారా?

భువనేశ్వరి: చంద్రబాబునాయుడు గారు లేక లేక 30 సంవత్సరాల క్రితం ఒక చీర తీసుకొచ్చారు. అది నాకు ఏ మాత్రం నచ్చలేదు. అయినా నాపై ప్రేమతో తీసుకొచ్చిన చీర అని భద్రంగా దాచుకున్నా. అప్పుడప్పుడు ఆ చీరను చూసుకుని మురిసిపోతుంటా.

రాములమ్మ: మాది చేనేత కుటుంబం. నా భర్త చనిపోవడంతో ఆర్థికంగా చితికిపోయి పిల్లలను చదివించుకోలేని స్థితిలో ఉండేదానిని. మీ అబ్బాయి (నారా లోకేశ్) స్పందించి, మా పిల్లలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తున్నారు. మీకు రుణపడి ఉంటా.

భువనేశ్వరి: సంతోషమమ్మా. రాష్ట్ర వ్యాప్తంగా పేద పిల్లలను గుర్తించి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వేలాది మందికి చదువు అందిస్తున్నాం. వారు బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో ఉండటం ఆనందంగా ఉంది.



నారా భువనేశ్వరికి హారతి పడుతున్న మహిళలు



పట్టు చీరల తయారీ గురించి తెలుసుకుంటూ..



నారా భువనేశ్వరికి సత్కారం



మహిళలతో కరచాలనం

చనిపోయిన యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



భువనచంద్ర (ఫైల్)



సాలార్‌బాషా (ఫైల్)

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు భువనచంద్ర (26)గా గుర్తించారు. అదే ప్రమాదంలో బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన సాలార్ బాషా (46) మృతిచెందిన విషయం విదితమే. రాప్తాడు మండలం కళాకారుల కాలనీకి చెందిన మల్లికార్జున, శశికళ దంపతుల కుమారుడు భువనచంద్ర హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాదు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. కరిడికొండ గ్రామశివారులో బుక్క రాయసముద్రానికి చెందిన సాలార్ బాషా గుజిరీ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. అక్కడ పెట్రోల్ బంకు వద్ద ఆటో ఆపి రోడ్డు దాడుతుండగా భువనచంద్ర ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. సాలార్‌బాషాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కదిరి, ఫిబ్రవరి 14: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతోపాటు ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) చెన్నక్రిష్ణ తెలిపిన వివరాలివి. కుమ్మరవాండ్లపల్లి ఉన్నత పాఠశాలను డీఈఓ బుధవారం తనిఖీ చేశారు. 10వ తరగతి గణిత పాఠ్యాంశాలు ఇంకా పూర్తి చేయకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, రవిచంద్రకు, ఉదయం హాజరేసి తిరిగి విధులకు హాజరుకాని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ నిర్మలకు, విధి నిర్వహణలో విఫలమయ్యారని ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చారన్నారు. బయలాజికల్ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్ నాయక్ మెడికల్ సెలవు పెట్టి, గ్రూప్-1 కోచింగ్ వెళ్లినట్లు తెలియడంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల సమయంలో సెలవు ఎలా ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించినట్లు సమాచారం.

ఐదు లక్షలిచ్చినా వైసీపీకి ఓటేయను

రాజధాని లేదు.. పరిశ్రమలు లేవు

టెలీ కాలర్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం

రాప్తాడు, ఫిబ్రవరి 14: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ఓ ఫోన్‌కాల్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. ఏడాదికి రూ.5 లక్షలు ఇచ్చినా ఈసారి వైసీపీకి ఓటు వేసే సమస్యే లేదని తేల్చి చెప్పారు. ఈ కాల్ రికార్డింగ్ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆసరా లబ్ధిదారు నాగేంద్రమ్మకు టెలికాలర్ ఫోన్ చేయగా, ఆమె భర్త లిఫ్ట్ చేశారు. 'నాగేంద్రమ్మకు ఆసరా డబ్బు అందుతోందా? ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?' అని మొదట టెలికాలర్ ప్రశ్నించారు. అందుతున్నాయని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఓటు వేయాలని టెలికాలర్ కోరారు. దీంతో నాగేంద్రమ్మ భర్త సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రభుత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఎంబీఏ చదివిన నా కొడుకు ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడు. రాష్ట్రానికి రాజధాని లేదు. పరిశ్రమలు లేవు, ఉద్యోగాలు లేవు. ఉచిత పథకాల ద్వారా తిని కూర్చుని సోమరిపోతులవుతున్నాం. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే రాజధాని, పరిశ్రమలు ఉండాలి. ఉద్యోగాలు కల్పించాలి. పాఠశాలలు అభివృద్ధి చెందాయని పత్రికల ద్వారా ప్రకటనలు ఇస్తున్నారు. బాగుంది. చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నా నోటిఫికేషన్ వదలడం లేదు. ఉద్యోగాలు కల్పించకుండా ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా ఏం లాభం?' అని నిలదీశారు. 'మా పిల్లల భవిష్యత్తు మాకు చాలా ముఖ్యం. ఈ సారి వైసీపీ వాళ్లు ఎన్ని డబ్బులు ఇచ్చినా ఓటు వేయం.' అని స్పష్టం చేశాడు. ఇంటర్, డిగ్రీ చదివిన వాళ్లు కూడా రూ.5 వేలకు వలంటీర్ ఉద్యోగాలు చేస్తున్నారని, నిరుద్యోగ సమస్య ఉండటంతోనే వేరే దిక్కు లేక వలంటీర్లుగా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటై ఉంటే వలంటీర్ ఉద్యోగాలు చేయాల్సిన అవసరం ఉండేది కాదని అన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

● ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు ● ఘనంగా సేవాలాల్ 285వ జయంత్యుత్సవాలు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 14: బంజారాల పవిత్రక్షేత్రం సేవాఘడ్ అని, సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని సేవాలాల్ మహారాజ్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు సూచించారు. సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలను బుధవారం రాత్రి ప్రారంభించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. సేవాఘడ్‌ను పవిత్రక్షేత్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. చరిత్ర ఆధారంగా సేవాలాల్ మహారాజ్ జన్మస్థలాన్ని గుర్తించి సేవాఘడ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2000 సంవత్సరం నుంచి ఇక్కడ జయంత్యుత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రాజస్థాన్ పీఠాధిపతి రమేష్‌జీ మాట్లాడుతూ.. సేవాఘడ్ పవిత్ర క్షేత్రమన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. జాతి పురోగతి చెందాలంటే సంప్రదాయ పద్ధతులను ఆదునిక జీవన విధానాన్ని కలగలిసి జీవించాలని బంజారాలకు మార్గోపదేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ మాట్లడుతూ.. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు.

మహారాజ్‌కి, మాతా జగదాంబకి ప్రత్యేక పూజలు

సేవాఘడ్‌లో స్వామివారికి బుధవారం వేకువజామున పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. రాత్రి వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్దతున తరలివచ్చారు. గురువారం మాతాజగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి 101 మంది యువతులతో బోనాలు సమర్పిస్తారు. అత్యంత కీలకమైన మహాబోగ్ కార్యక్రమతో ఉత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవీంద్ర నాయక్, వెంకటరమణ నాయక్, యస్‌కే రామచంద్ర నాయక్, సీఐలు వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నబిరసూల్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ శివాజీ రెడ్డి పాల్గొన్నారు.





అలంకరణలో సేవాలాల్ మహారాజ్, జగదాంబ అమ్మవారు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రస్టు అధ్యక్షుడు, సభ్యులు



హాజరైన బంజారాలు

సీఎం సిద్ధం సభను అడ్డుకుంటాం: ఏఐవైఎఫ్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గం, ఫిబ్రవరి 14: వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాప్తాడులో నిర్వహించనున్న సిద్ధం సభను అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొత్రేష్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, టెట్, డీఎస్సీల నోటిఫికేషన్, పరీక్షకు 30 రోజుల సమయాన్నే కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీన్ని 90 రోజులకు పెంచాలన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి అన్ని కేటగిరీలకు రూ.750లు ఫీజు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. హామీలు అమలు చేయమని అడిగితే విద్యార్థి సంఘం నాయకులను నిర్బంధించడం, అరెస్టు చేయడం తప్ప ఈ ప్రభుత్వం యువతీయువకులకు ఉద్యోగాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే రాప్తాడులో జరిగే సిద్ధం సభను అడ్డుకోవడానికి ఏఐవైఎఫ్, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల జేఏసీగా తాము సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యవర్గ సభ్యుడు యోగేంద్ర, నాయకులు దినకర్, తేజ, మాధవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్'ను తిలకించిన టీడీపీ నాయకులు



రాజధాని ఫైల్స్ సినిమాను తిలకిస్తున్న కాలవ, ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 14: నగరంలోని గౌతమి థియేటర్‌లో బుధవారం సాయంత్రం రాజధాని ఫైల్స్ సినిమా ప్రత్యేక షోకు టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆ పార్టీ నాయకులతో కలిసి తిలకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఆంధ్రుల రాజధాని అమరావతి అని, మరో రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి రాబోతోందన్నారు. అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణం పూర్తి చేసి, శాశ్వత రాజధానిగా తీర్చిదిద్దుతామన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

రాప్తాడు, ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం రాప్తాడు తహసీల్దార్ సీతారామన్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతరులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ డీఏలు, కాంట్రాక్టు ఉద్యోగులు, రెగ్యులైజేషన్, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సిరాజుద్దీన్, ప్రభాకర్‌గౌడ్, సీహెచ్ఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపించకూడదు

● నగర కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14: రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్టుకు తరలించి కనిపించకుండా చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. బుధవారం ఒకటవ పారిశుధ్య సర్కిల్‌లో కార్మికుల మస్టర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని 2, 3, 5వరోడ్లు, ఆజాద్ నగర్, లక్ష్మీ నగర్, కొవూరు నగర్ తదితర వీధులలో పారిశుధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు చేశారు. అటెండెన్స్ సేకరించే పని ఉదయం 5:30లకు పూర్తి చేసి విధులలోకి వెళ్లాలని, ఉదయం 6గంటలు అవుతున్నా విధులకు రావటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమయములో ముఖ్య రహదారులను ఎలా శుభ్రం చేస్తారని, ఇలాంటి తప్పులు ఇంకోసారి జరిగితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్: టీడీపీ

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 14: సైకో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిపోయిందని రుద్రంపేట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపాల్‌గౌడ్ అన్నారు. బుధవారం వైసీపీ ఐదేళ్ల పాలనకు సంబంధించిన పోస్టర్లను రుద్రంపేటలో విడుదల చేసి ఇంటింటికీ అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాలనలో నిరుద్యోగంలో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. గంజాయి స్మగ్లింగ్‌లో మొదటిస్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో మూడోస్థానంలో ఉందన్నారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారన్నారు. కార్యక్రమంలో రుద్రంపేట క్లస్టర్ ఇన్‌చార్జి గంగవరం అంజి, ఎస్సీసెల్ అధ్యక్షుడు వేంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి నాగ, శివ పాల్గొన్నారు.

సెలవులో అనంతపురం ఇన్‌చార్జి ఏఓ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 14: అనంతపురం మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సాయిలక్ష్మి 20రోజులపాటు సెలవుపై వెళ్లారు. మెడికల్ గ్రౌండ్ కింద ఆమెకు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సెలవు మంజూరు చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ ఏఓ శశికళ మెటర్నటీ సెలవులో ఉన్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం ఏడీ ఆఫీస్‌లో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న సాయిలక్ష్మికి ఇటీవల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆమె సెలవుపై వెళ్లడంతో ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలోనన్న సందిగ్ధంలో వ్యవసాయ ఉన్నతాధికారులు పడ్డారు.

'సమ్మెను జయప్రదం చేయండి'

నార్పల, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు నాగవేణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరికి నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, సీపీఐ సీనియర్ నాయకులు నాగరాజు, మాబు, సంజీవరాయుడు, పాల్గొన్నారు.

రాప్తాడు: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తోందని ఆ మోసాలను ప్రజలకు తెలిపేందుకు గురువారం నిర్వహించే గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర , రైతు సంఘం నాయకులు నియోజకవర్గ కార్యదర్శి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ డీఎస్పీకి అదనపు బాధ్యతలు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 14: ట్రైనీ డీఎస్పీ పృథ్వీ బుధవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. రామగిరి సీఐగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. సీఐగా ఉన్న శివప్రసాద్‌ను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డీఐజీ అమ్మిరెడ్డి సస్పెండ్‌చేసిన చేశారు. దీంతో ట్రైనీ డీఎస్పీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14: చదువు ఇష్టంలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అనంతపురం రూరల్ మండలంలోని అక్కంపల్లి వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్న అఫ్రోజ్(17) పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. చదవడం ఇష్టం లేని అఫ్రోజ్ తల్లిదండ్రులు బలవంతం చేయడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాంబశివారెడ్డి నిర్లక్ష్యంతోనే రిమాండ్‌కు రైతులు

- బండారుశ్రావణి

శింగనమల, ఫిబ్రవరి 14: ఉల్లికల్లు రైతులు, వైసీపీ కార్యకర్తల రిమాండ్‌కు ఆలూరు సాంబశివారెడ్డి నిర్లక్ష్యమే కారణమని నియోజకవర్గ టీడీపీ నాయకురాలు బండారు శ్రావణీశ్రీ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. రైతులను, కార్యకర్తలను తన రాజకీయం కోసం వాడుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారే బుద్ధిచెబుతారన్నారు.

డ్వామా ప్లాంటేషన్ మేనేజర్‌గా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 14: డ్వామా ప్లాంటేషన్ మేనేజర్‌గా లక్ష్మీనారాయణ బుధవారం నియమితుడయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నగరానికి నీటి కష్టం

● పనిచేయని మోటార్లు ● మరమ్మతుల పేరిట కాలయాపన

● స్పందించని ప్రజాప్రతినిధులు, అధికారులు



సీపీఎం నేతల ఆందోళన (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14: నగరంలో నీటి సమస్య విలయతాండవం చేస్తోంది. 12 రోజులుగా నగర ప్రజలకు తాగునీరు సరఫరా కావడంలేదు. ఈనెల 3వ తేదీ కార్పొరేషన్ అధికారులు ఒక ప్రకటన ఇచ్చారు. రోజు మార్చి రోజు నీరు సరఫరా అవుతుందని, సహకరించాలని చెప్పుకొచ్చారు. అయితే 12 రోజులు అవుతున్నా నీరు సరఫరా కాలేదు. దీంతో ప్రజలు తాగునీటి నుంచి స్నానం వరకు, ఇంట్లో అవసరాలకు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నగరం నడిబొడ్డు ప్రాంతాల ప్రజలు సైతం రూ. 300 వెచ్చించి ఉప్పునీళ్ల ట్యాంకర్లను కొనాల్సిన దుర్భరపరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇక మంచినీళ్ల ట్యాంకు అయితే ఇంకా ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. ఇదే క్రమంలో ఫిల్టర్ నీరు అందించే ట్యాంకర్ల నిర్వాహకులు మరింత ఎక్కువ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిస్థితులు ఇలా ఉంటే నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారన్న విమర్శలు నగరవాసుల నుంచి వినిపిస్తున్నాయి. రెండురోజుల క్రితం సీపీఎం నాయకులు నగరపాలక సంస్థ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, పాలక వర్గం అధికారుల తీరుపై మండిపడ్డాయి.

మోటార్లన్నీ రిపేరీలోనే...

నగరానికి తాగునీటిని పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) డ్యాం నుంచి తీసుకొచ్చి ముద్దాలపురంలో శుద్ధిచేసి సరఫరా చేస్తున్నారు. ఈ ప్రక్రియకు అప్పట్లో కొన్ని కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం అక్కడ 750 హెచ్‌పీ మోటర్ ఒక్కటి, 500 హెపీ మోటర్లు 3 ఉన్నాయి. వీటిలో తరచూ ఒక మోటార్‌ను స్టాండ్‌బైగా ఉపయోగిస్తారు. అయితే మూడు నెలలు క్రితం 750 హెపీ మోటారు రిపేరీకి గురైంది. మరమ్మతు చేయించాల్సిన అధికారులు పక్కన పెట్టేశారు. 25 రోజుల క్రితం 550 హెచ్‌పీ మోటారు మరమ్మతుకు వచ్చింది. దానిని మరమ్మతు నిమిత్తం తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు తీసుకెళ్లారు. అది ఇప్పటి వరకు రిపేరీ కాలేదు. 12 రోజుల క్రితం మరో 550 హెపీ మోటారు రిపేరీకి వచ్చింది. దాన్ని మరమ్మతు చేసే మెకానిక్ చనిపోయాడని చెప్పి బెంగుళూరుకు తీసుకెళ్లారు. ఈ మూడింటిలో ఇప్పటి వరకు ఒక్కటి కూడా మరమ్మతుకు నోచుకోలేదు. ఇందులో పాలక వర్గం అలసత్వం... అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక్క మోటార్‌ను రిపేరీ చేయడానికి ఇన్ని రోజులు అవసరమా అని నగర ప్రజలు విస్తుపోతున్నారు.

స్పందించని ప్రజాప్రతినిధులు

కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లకు గాను 48 మంది వైసీపీ కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం అదే ఆ పార్టీ అధికారంలో ఉంటోంది. నగరంలో ఇన్ని రోజులుగా నీరు అందకపోయినా మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్లు, 45 మంది కార్పొరేటర్లు సమస్యపై కనీసం స్పందించకపోవడం దారుణమని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇక అధికారుల విషయానికి వస్తే దున్నపోతు మీద వానకురిసిన చందంగా తయారైంది. టీడీపీ పాలకవర్గంలో ఎప్పుడూ మోటార్ల మరమ్మతుల విషయంలో ఇలాంటి పరిస్థితి నెలకొనలేదు. స్థానికంగా ఉన్న మెకానిక్‌లతో మరమ్మతులు చేయించకుండా ఎమర్జెన్సీ పేరుతో ఇతర రాష్ట్రాలలోని నగరాలకు తీసుకెళ్లడం ఏంటన్న ప్రశ్న నగరవాసుల నుంచి వ్యక్తం మవుతోంది. వర్కుల పేరుతో కమీషన్లు అంటు జేబులు నింపుకునే ఇంజనీరింగ్ అధికారులు ప్రజల సమస్యలపైనైనా మానవత్వం చూపించాల్సిన అవసరం ఎంతైన ఉంది. మరి ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో... ఎప్పుడు తాగునీటి సమస్య పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే.

మరమ్మతుల పేరుతో కాలయాపన

కూడేరు మండలం ముద్దాలపురం నుంచి నగరానికి తాగునీరు సరఫరా అవుతోంది. కొన్ని రోజులుగా అక్కడి ఫిల్టరేషన్ ప్లాంట్‌లో మోటర్లు పనిచేయకపోవడంతో తాగునీరు సరఫరా కావడంలేదు. కనీసం మోటర్లకు మరమ్మతు చేయించలేదని దుస్థితిలో పాలక వర్గం, అధికారులు ఉండడం తీవ్ర విమర్శలు తావిస్తోంది. తాగునీటి సమస్యకు ఎప్పుడు పరిష్కారం దొరుకుతుందోనని నగరవాసులు ఎదురుచూపులు చూస్తున్నారు. మరమ్మతుల పేరుతో కాలయాపనా అంటూ మండిపడుతున్నారు.

ఉచితంగా తాగునీటి సరఫరా

అనంతపురం అర్బన్: నగర పాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ హమాలీ కాలనీలో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ బుధవారం మూడు ట్యాంకర్లతో తాగునీటిని తెప్పించి స్థానిక ప్రజలకు దాహార్తి తీర్చారు. నగర పాలక సంస్థ నీరు సరఫరా చేసేదాకా ట్యాంకర్లతో నీటిని అందిస్తానని హామీ ఇచ్చారు.

జనసేన ఆధ్వర్యంలో.. అనంతపురం ప్రెస్‌క్లబ్: నగరంలోని సంఘమిత్ర కాలనీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని జనసేన జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్ పరిష్కరించారు. బుధవారం ఉచితంగా రక్షిత మంచినీటిని సరఫరా చేశారు. తమ సమస్యలను ప్రజలు జనసేన నాయకుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, నగర ఉపాధ్యక్షుడు సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు ధనుంజయ్, కిరణ్‌కుమార్, కృష్ణ, నగర ప్రధానకార్యదర్శి వెంకటేష్, హుస్సేన్, నగర కార్యదర్శులు కుమ్మర మురళి, అంజి, సంపత్, రమణ, అశోక్, నాయకులు విజయ్, ఉదయ్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



హమాలీ కాలనీలో తాగునీరు సరఫరా చేస్తున్న బంగి నాగ



సంఘమిత్ర కాలనీలో నీటిని సరఫరా చేస్తున్న జనసేన నాయకులు

అలరించిన బాలోత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14: 'అనంత బాలోత్సవ' సంబరం ముగిసింది. మూడురోజులుగా అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం పిల్లల ఆటపాటలతో సందడిగా సాగింది. చివరిరోజున నృత్య ప్రదర్శనలతోపాటు మట్టితో బొమ్మలు తయారుచేయడం, కర్రసాము, ముఖాభినయం, నాటకీకరణ, జానపదనృత్యం, కోలాట ప్రదర్శనలు జరిగాయి. మొత్తంగా మూడురోజుల ఉత్సవాల్లో 135 పాఠశాలలనుంచి దాదాపు 6వేల మంది విద్యార్థులు 64 రకాల ఈవెంట్స్‌లో పాల్గొని తమ ప్రదర్శనలిచ్చారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయి: కుష్బు కొఠారి

పిల్లల్లో దాగున్న ప్రతిభతోపాటు సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి అన్నారు. బాలోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడురోజులపాటు ఇంతటి చక్కటి వాతావరణంలో బాలోత్సవాన్ని సజావుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, సభ్యులు శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, విశ్రాంత తహసీల్దార్ జయరామప్ప, మానవత రక్తదాతల సంస్థ ప్రతినిధి తరిమెల అమర్నాథరెడ్డి, అపెక్స్ అధినేత తిరుపాల్, కేర్ అండ్ క్యూర్ వైద్యుడు అభిలాష్, యూటీఎఫ్ నాయకుడు నాగేంద్ర, కోటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి



రఘుసైనిక్ స్కూల్‌లో వేదపండితుల ఆశీర్వాదం



మినర్వా పాఠశాలలో...



శృంగేరి శంకరమఠంలో సామూహిక అక్షరాభ్యాసం

వైభవంగా వసంత పంచమి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14: వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. శారదానగర్‌లోని శృంగేరి శంకర మఠంలో శారదామాతను సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను చేయించారు. మహామంగళహారతి నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో: సోమనాథ్‌నగర్‌లోని కోదండరామాలయంలో గాయత్రి పంచాయతన ప్రతిష్ఠాపనను వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో నదీజలాల కలశాలతో ప్రాకారోత్సవం నిర్వహించి, సాయంత్రం గణపతి హోమం, రుద్రహోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిగ్‌బాస్ షో రన్నరర్ అమర్‌దీప్ చౌదరి, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, మణూరు నాగరాజరావు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి

కాశీవిశ్వేశ్వరాలయంలో: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ ఆవరణలోని శారదామాత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: నగరంలోని పలు విద్యాలయాల్లో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా సాగాయి. వసంత పంచమిని పురస్కరించుకుని అశోక్ నగర్‌లోని మినర్వా పాఠశాలలో పండితులతో సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీచైతన్య పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏఓ విజయకృష్ణన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ సరిత పాల్గొన్నారు.

రఘు సైనిక్ స్కూల్‌లో అక్షరాభ్యాసం

స్థానిక రఘు సైనిక్‌స్కూల్‌లో వసంత పంచమిని పరస్కరించుకుని అక్షరాభ్యాసం, సరస్వతి పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పడింతులతో పిల్లలకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించి, పాఠశాల డైరెక్టర్ రఘు పిల్లలతో అక్షరాలుదిద్దించారు.

ట్యాంకర్లతో నీటి తరలింపు

శింగనమల, ఫిబ్రవరి 14: శింగనమల చెరువు నుంచి అనుమతి ఇచ్చేవరకు రోడ్డు పనులకు నీటిని తరలించవద్దని ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసును బేఖాతరు చేస్తున్నారు. రోడ్డు పనుల కోసం బుధవారం దర్జాగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధి భర్తకు భారీగా ముడుపుల అందాయని, ఆయన ఆదేశాల మేరకు నీటి విషయంలో అధికారులు జోక్యం చేసుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఐ

మద్యం విక్రేత అరెస్టు

శింగనమల: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అతడి వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

'వ్యక్తిత్వ వికాసంతో ఉత్తమ జీవితం'

అనంతపురంప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 14: వ్యక్తిత్వ వికాసంతో ఉత్తమ జీవితాన్ని పొందవచ్చని కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు అంబిక అన్నారు. బుధవారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సదస్సులో మహాలక్ష్మి మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించి చదువులో ప్రతిభ కనబర్చాలన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఐక్యూఏసీ సమన్వయకర్త పర్వీన్, కాపుసంక్షేమ సేన నాయకులు ఉమా, మధులిక, సావిత్రమ్మ, పద్మావతి, సైకాలజిస్ట్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

గార్లదిన్నె, ఫిబ్రవరి 14: పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని తహసీల్దార్ లోకేశ్వరి ఆదేశించారు. బుధవారం మండలంలోని మర్తాడు, కోటంక తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

టీడీపీ నాయకుల నివాళి

శింగనమల, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదంలో పెద్ద మట్లగొంది గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సాయికుమార్ భార్య నాగేశ్వరమ్మ మృతి చెందింది. తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాసరి గంగాధర్, దండుసతీష్, దండుప్రకాష్, మునేంద్ర నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పీడీ ప్రతిభ

శింగనమల: మాస్టర్స్ నేషనల్ గేమ్స్ ఆర్చరీలో శింగనమల జిల్లా పరిషత్ పాఠశాల పీడీ నందకూమార్ ప్రతిభ చూపాడు. ఈనెల 8 నుంచి 13వతేదీ వరకు గోవాలో జరిగిన మాస్టర్స్ నేషనల్ గేమ్స్ ఆర్చరీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పీడీని ఉపాధ్యాయులు అభినందించారు.

18న టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 14: జిల్లా సబ్‌జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 18న కళ్యాణదుర్గంలోని కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010 ఏప్రిల్ 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు ఎంపిక పోటీలకు అర్హులన్నారు. బాల, బాలికల సబ్‌జూనియర్ క్యాటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9652117133, 8179819416లను సంప్రదించాలని కోరారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ

జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ చాటారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలోని మహవీర్ జిల్లాలో నిర్వహించిన 41వ జాతీయ జూనియర్ బాలబాలికల టోర్నీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సుప్రియా, జ్యోతిక, చరణ్ ప్రతిభ చాటి రాష్ట్ర జట్లను తృతీయ స్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించారు. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి, ఉపాధ్యక్షులు చెన్నయ్య, ప్రభాకర్ గౌడ్, కోశాధికారి వలీ, పీడీ అమరాంజనేయులు అభినందించారు.

25న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్: తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురుస్వామి తెలిపారు. కిడ్స్, సబ్‌జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ బాల, బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. జనన ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శాంతరాజ్ సెల్ నంబరు 8019866943ను సంప్రదించాలని కోరారు.

'అక్రమార్కులకు వంతపాడారు'

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14: ఎస్కేయూ మాజీ వీసీ రామకృష్ణారెడ్డి అక్రమార్కులకు వంతుపాడారని ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మండిపడ్డారు. అక్రమ ప్రమోషన్లను వెనక్కితీసుకోవాలని బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ పాలక మండలి ఆమోదంలేనిదే వర్సిటీలో ఎలాంటి నిర్ణయాలు అమలు చేయడానికి అవకాశంలేదన్నారు. అయితే లైబ్రేరి ఉద్యోగుల హక్కులను హరిస్తూ జూనియర్ అసిస్టెంట్ రఘోత్తమరెడ్డికి గ్రేడ్-1 ప్రమోషన్ ఇచ్చారన్నారు. విచారణచేపట్టి అర్హులకు న్యాయంచేయకపోతే బాధితులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అనంతరం వీసీ హుస్సేన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎల్‌పీఓగా సోమశేఖర్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 14: అనంతపురం ఇన్‌చార్జి డివిజినల్ పంచాయతీ అధికారిగా ఏఓ సోమశేఖర్‌ను నియమించారు. రెగ్యూలర్ డీఎల్‌పీఓ సుమన జయంతి తమ వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. దీంతో ఆ స్థానంలో ఏఓ సోమశేఖర్‌ను నియమించేలా డీపీఓ ప్రభాకర్‌రావు కలెక్టర్‌కు ఫైల్ పంపారు. ఆమోదం తెలపడంతో ఇన్‌చార్జి డీఎల్‌పీఓగా సోమశేఖర్ వ్యవహరించనున్నారు.

అణచివేత దుర్మార్గం: వీకేసీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14: పంటలకు మద్దతు ధర కల్పించాలని ఉద్యమిస్తున్న రైతులపై అణచివేతకు దిగిన ప్రధాని నరేంద్రమోదీ చర్యలు దుర్మార్గమని వీకేసీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ అన్నారు. బుధవారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా దేశంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం సాగుతోందన్నారు. రైతులను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో రైతులే గద్దె దించుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, గోపాల్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14: పుల్వామా దాడిలో అమరవీరులకు విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. బ్లాక్‌డేను పురస్కరించుకుని బుధవారం ఎస్ఎస్‌బీఎన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రసూల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతమి, హేమ, లిఖిత, అంకిత, అభి, సాంబ, మునీశ్వర్, నారాయణస్వామి, తేజ, నరేంద్ర పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14: జేఎన్‌టీయూ సమీపంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుడి దేవాలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. దేవాలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు హనుమంత రెడ్డి, సభ్యులు బ్రహ్మానందరెడ్డి, వెంకటరమనారెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆపరేషన్‌కు అమ్మ సంస్థ చేయూత



నగదు అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14 : అంధత్వంతో తల్లిదండ్రులు, గొంతులో గడ్డతో 11 నెలల చిన్నారి బాధపడుతుండడంతో సదరు చిన్నారి ఆపరేషన్ నిమిత్తం అమ్మసంస్థ చేయూతనందించి అండగా నిలిచింది. అశోక్‌నగర్‌కు చెందిన రవికుమార్, శృతి పుట్టుకతోనే 80శాతం అంధత్వం కలిగివున్నారు. వీరికి 4 సంవత్సరాల కుమారుడు, 11 నెలల కుమార్తె సంతానం. ఇటీవల రవికుమార్ మిగిలిన 20శాతం చూపు కూడా కోల్పోయాడు. ఇక శృతి ఇళ్లపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం చిన్నారి పాలు తాగలేక వాంతులతో ఇబ్బంది పడుతుంటే ఈఎన్‌టి వైద్యులను సంప్రదించగా పాపకు గొంతులో గడ్డ ఉందని, ఆపరేషన్‌కు రూ.2లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో వారు అమ్మ సంస్థను ఆశ్రయించారు. బుధవారం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చిన్నారి ఆపరేషన్, వారి ఖర్చుల నిమిత్తం రూ.2.50లక్షలను బాధిత కుటుంబానికి అందజేశారు.

చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా

యాడికి, ఫిబ్రవరి14: ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంటుందని డీఎస్పీ గంగయ్య తెలిపారు. బుధవారం మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా సరిహద్దు గ్రామాల వివరాలు ఆరాతీశారు.

ఓటరు జాబితాపై టీడీపీ ఫిర్యాదు

బెళుగుప్ప, ఫిబ్రవరి 14 : ఏళ్ల తరబడి గ్రామాల్లో లేకున్నా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేశారని, ఆధార్ కార్డులు మార్పులు చేసి నాలుగైదు పోలింగ్ కేంద్రాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు చేర్చారని బుధవారం టీడీపీ నాయకులు, తహసీల్దార్ హరినాథ రావుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ బీఎల్వోలు అధికార పార్టీతో కుమ్మక్కై ఓటరు జాబితా తయారీలో అవకతవకలకు పాల్పడ్డార న్నారు. బెళుగుప్పలోని 185, 188, 189, 190 పోలింగ్ కేంద్రాల్లో మరలింగప్ప, తిమ్మప్పలు 20 ఏళ్లుగా ఊళ్లో లేరని అయినా వారి పేర్లు చేర్చారన్నారు. బెళుగుప్ప తండాలో 23 మంది టీడీపీ సానుభూతిపరులన్న దురుద్దేశంతో 23 ఓట్లను తొలగించారని ప్రభాకర్ నాయక్ ఆరోపించారు.

పీఆర్సీని అమలు చేయాలని నిరసన



గుత్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు


కళ్యాదుర్గం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు

గుత్తి, ఫిబ్రవరి 14: పీర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, షేక్షావలి, నాగరాజు, సయ్యద్‌బాషా, దేవదాసు, లోకేష్, చాంద్‌బాషా, రాజగోపాల్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షురాలు సంపూర్ణ, కార్యదర్శి రామాంజినేయులు, సుబ్బలక్ష్మి, చలపతి, మల్లికార్జున, చాంద్‌బాషా, ఎర్రిస్వామి, మురళి, కృష్ణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ఉద్యోగులు, పెన్షనర్లను దగా చేస్తోందని పలువురు మండిపడ్డారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ జేఏసీ ఉపాధ్యక్షులు జక్కుల మాధవ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేశులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలో నిరసన తెలిపి, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి రైతు బలి


చిట్రా రాధాకృష్ణ (ఫైల్)

కూడేరు, ఫిబ్రవరి 14: మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన రైతు చిట్రా రాధాకృష్ణ (43) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు గ్రామ సమీపంలో చిట్రా రాధాకృష్ణకు తన 4 ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో పంటకు నీరు పెట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. తోటలో మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టెను తాకాడు. అప్పటికిపదానికి విద్యుత్ సరఫరా జరుగుతండటంతో రాధాకృష్ణ విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయాడు. అర్ధరాత్రి దాటినా ఇంటికి రాకపోవడంతో ఆందోళనతో భార్య మాధవి కుటుంబ సభ్యులు తోటలోకి పరుగులు తీశారు. తోటంతా తిరిగినా కనిపించకపోవడంతో స్టార్టర్ పెట్టె వద్దకు వెళ్లారు. అక్కడ విగత జీవిగా పడి ఉన్న రాధాకృష్ణను చూసి విలపిస్తూ, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. మృతిడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

చరిత్ర పురుషుడు వాల్మీకి: కాలవ


కాదలూరులో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 14: రామాయణ మహా కావ్యాన్ని రాసిన వాల్మీకి మహర్షి చరిత్ర పురుషుడని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కాదలూరు గ్రామంలో బుధవారం మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామస్థులు కాలవ శ్రీనివాసులుకు శాలువ, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ రామాయణాన్ని రచించి శ్రీరాముడి జీవితాన్ని ప్రజల హృదయాల్లో సజీవంగా ఉండేలా చేసిన మహాకవి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి , ఎంపీటీసీ మురడి గంగాధర తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన చింతపండు ధరలు

రాయదుర్గం, ఫిబ్రవరి 14: పట్టణంలోని మార్కెట్‌లో బుధవారం నిర్వహించిన చింతపండు వేలంలో ధరలు ధరలు తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్‌యార్డ్ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం, గుమ్మఘట్ట తదితర ప్రాంతాల నుండి 13 మంది రైతులు 1084.5 క్వింటాళ్ల చింతపండు మార్కెట్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. అదే విధంగా గత వారం కంటే ఈ వారం చింతపండు ధరలు తగ్గినట్లు ఆయన తెలిపారు. కర్పూలీ రకం రూ. 9200 నుంచి రూ. 17 వేల వరకు ధర పలికిందన్నారు. చపాతి రకం రూ. 4500 నుంచి రూ. 7500 వరకు ధర పలికినట్లు తెలిపారు. ఇక్కడ సేకరించిన చింతపండును ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసినట్లు తెలిపారు.

ఖాళీ అవుతున్న వైసీపీ: మాజీ ఎమ్మెల్యే


పార్టీలో చేరిన పులగుట్టపల్లి వారితో జితేంద్రగౌడు

గుంతకల్లు, ఫిబ్రవరి 14: ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అవుతుందని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడు పేర్కొన్నారు. మండలంలోని పులగుట్టపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పాల మల్లికార్జున, వన్నూరప్ప ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పలు దళిత కుటుంబాలు టీడీపీలో చేరాయి. జితేంద్రగౌడు తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ పుట్టి మునిగిపోతుందని భావించిన ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీవైపు వస్తున్నారన్నారు. పులగుట్టపల్లికి చెందిన ఆంజనేయులు, హనుమేశ్, అనిల్ కుమార్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో తలారి మస్తానప్ప, మల్లికార్జున, హనుమంతు, చికెన్ జగన్, ఓ చంద్రన్న, జగన్నాథ్, దశరథ్ పాల్గొన్నారు.

పోలీసు పహారా మధ్య 'ఆసరా' సభ


ఆసరా సమావేశం వద్ద పోలీసుల పహారా

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 14: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పోలీసుల పహారా మధ్య నిర్వహిం చారు. సమావేశం ప్రారంభం నుండి ముగిసే దాకా అధికారులు, పోలీసు లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. సమావేశానికి వైసీపీ రెబల్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరు కావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, దాదాపు 60 మంది దాకా పోలీసుల బందోబస్తు నడుమ సమావేశం జరిగింది. సమావేశంలో మెట్టు గోవిందరెడ్డి మాత్రం జగన్ చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కాపు రామచంద్రారెడ్డి తన 15 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏసీ గంగాధర్, ఎంపీడీఓ గౌరీదేవి, ఏపీఎం కాలానాయక్ పాల్గొన్నారు.

శింగనమల గౌరవాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న శైలజానాథ్

పుట్లూరు, ఫిబ్రవరి14: శింగనమల నియోజకవర్గ గౌరవాన్ని కాపాడుకోవాలని మాజీ పీసీసీ చీఫ్ శైలజానాథ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత పదేళ్ల నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి పనితనం, మంచితనం చూసి ఎన్నుకోవాలన్నారు. ప్రస్తుతం కరువు వచ్చిందని, రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికార పక్షానికి ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, పూల ప్రసాద్, విష్ణునారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి



చిన్నారితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 14: మండలంలోని ఎగువపల్లి, దిగువపల్లిలో బుధవారం సాయంత్రం టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. టీడ రాష్ట్రంలో వైసీపీ పాలన అంతమొందించే సమయం ఆసన్నమైందని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు.

సీపీఐ ర్యాలీ

తాడిపత్రి, ఫిబ్రవరి 14: మండలంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొన్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ బుధవారం సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. 1998-2000 మధ్యకాలంలో 94మంది లబ్ధిదారులకు మండలంలోని అక్కన్నపల్లిలో 2సెంట్ల ప్రకారం ఇళ్ల స్థలాలను ఇచ్చారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ర్యాలీలో నాగరంగయ్య, నారాయణరెడ్డి, రామాంజనేయులు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు భవిత: పీజేఆర్


టీడీపీలోకి చేరిన యువకులతో జీవానందరెడ్డి

పామిడి, ఫిబ్రవరి 14: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఆపార్టీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో బుధవారం పామిడి మార్కెట్(నారాయణస్వామి వీధి)కి చెందిన 30 కుటుంబాలు జీవానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి జీవానందరెడ్డి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటి యువతరానికి చంద్రబాబు ఎంతో అవసరమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. హెచ్చెల్సీ ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ రామలింగారెడ్డి, టీడీపీ నాయకులు మారుతివర ప్రసాద్ రెడ్డి, శ్రీరాములు, మున్నా, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారికే ఓటు వేయండి: జేసీపీఆర్


జేసీ ప్రభాకర్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి14: యువత బాగా ఆలోచించి అభివృద్ధి చేసేవారికే ఓటు వేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. యువచైతన్య బస్సుయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని అమ్మల దిన్నె, కొత్తపల్లి, నారాపురం, తిమ్మనచెరువు, చింతలపల్లి, జూటూరు గ్రామాల్లో జేసీపీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. స్వగ్రామమైన జూటూరులో పెద్దఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు మంచి జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఉద్యోగాలు కావాలంటే చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రఘునాయుడు, జేసీ సుదీప్‌రెడ్డి, కూచి సాయి మోహన్, భాస్కర్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి యాదవ్, రంగయ్య, యుగంధర్, వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందిపై దాడికి యత్నం

పుట్లూరు, ఫిబ్రవరి14: మండలంలోని చింతకుంట గ్రామశివారులో కానిస్టేబుల్ చంద్రశేఖర్‌పై మద్యం సేవిస్తున్న ఇరువురు వ్యక్తులు దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలమేరకు... స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే చంద్రశేఖర్ మంగళవారం రాత్రి డ్యూటీ ముగించుకొని అనంతపురంలోని ఇంటికి బయలుదేరాడు. చింతకుంట గ్రామ శివారులో మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్దకు వెళ్లి ఇలా బహిరంగప్రదేశాల్లో మందు తాగకూడదంటూ హెచ్చరించాడు. దీంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగి తోసుకున్నారు. దీంతో కానిస్టేబుల్ ముఖంపై స్వల్ప గాయమైందని తెలిసింది. దాడికి యత్నించిన వ్యక్తులు యల్లనూరు మండలానికి చెందిన మల్లికార్జుననాయుడు, మధుసూదన్‌నాయుడులుగా గుర్తించారు. ఈ విషయంపై ఎస్‌ఐ హేమాద్రిని వివరణ కోరగా ఇరువురు తోసుకున్న మాట వాస్తవమే. కేసు కూడా నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి14: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అశ్వత్థ నారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మాఘమాసం సందర్భంగా మొదటి ఆదివారం శాశ్వత హుండీ ద్వారా రూ.1,82,870, తాత్కాలిక హుండీ ద్వారా రూ.3,31,115 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం


లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

కుందుర్పి, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మడుగుతేరును లాగారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం రాత్రి పది గంటల సమయంలో భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని భక్తుల కోలాహలంగా లాగారు. స్థానిక రామస్వామి ఆలయం నుంచి జమ్మి వృక్షం వరకు రథాన్ని లాగారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదంలో గాయపడిన లైన్‌మన్ విజయ్‌కుమార్(45) చికిత్స పొందుతూ మృతి చెందారు. రాయదుర్గం మండలంలో నాగిరెడ్డిపల్లి గ్రామానికి విద్యుత్తు లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బొమ్మనహాళ్‌లో నివాసం ఉంటూ విధులకు హాజరయ్యేవారు. ఈ నెల 3న విధులు నిర్వహించడానికి సాయంత్రం బొమ్మనహాళ్‌కు వస్తుండగా ఉద్దేహాళ్ వద్ద ద్విచక్ర వాహనం నుండి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు బళ్లారికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ నయం కాక విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

బాబు ష్యూరిటీ పట్ల సమీక్ష

యల్లనూరు, ఫిబ్రవరి14: మండలకేంద్రంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై నియోజకవర్గ అబ్జర్వర్ గురుమూర్తి సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు టీడీపీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అబ్జర్వర్ చంద్రశేఖర్‌నాయుడు, వాసాపురం బాబు, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, శరత్‌చంద్రనాయుడు, పవన్‌కుమార్, కుళ్లాయప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

బెళుగుప్ప, ఫిబ్రవరి 14: మండలంలోని ఎర్రగుడికి చెందిన యువ రైతు ఉమాపతి(43) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం ఛాతి నొప్పిస్తుందని బాధపడుతుండగా బెళుగుప్పకు తీసుకెళ్లగా కళ్యాణదుర్గంకు తీసుకెళ్లాలని డాక్టరు సూచించారు. మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. తన కున్న 4 ఎకరాలతో పాటు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించేవారు. మృతుడికి భార్య వన్నూరమ్మ, ముగ్గురు కుమార్తెలు అంజలి, సౌమ్య, పల్లవి సంతానం ఉన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం: ఉన్నం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వంను గద్దె దించుదామంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బుడిమేపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. చీరలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నం కోడలు ఉన్నం వరలక్ష్మీ, సుభాన్, రాజశేఖర్‌గౌడ్, విరుపాక్షి రెడ్డి, తిమ్మప్ప చౌదరి, హనుమంతప్ప పాల్గొన్నారు.

కార్మికుల గొంతునొక్కడం దుర్మార్గం


నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 14 : శ్రీరాంరెడ్డి వాటర్ కార్మికుల గొంతు నొక్కడం దుర్మార్గమని కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తమ సమ్మెను శ్రీరామ్‌రెడ్డి పంపుహౌస్ ఎదుట నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇవ్వాల్సిన నాలుగు నెలల జీతం, ఇతర అలవెన్సులు వెంటనే ఇవ్వాలన్నారు. గురువారం సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుళు ఆధ్వర్యంలో మోటార్లు ఆఫ్ చేస్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట టీడీపీ ధర్నా


కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి, ఫిబ్రవరి14: పట్టణంలోని చెత్తసేకరణ వాహనాలకు డీజిల్ పట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ చాంబర్ ఎదుట టీడీపీ కౌన్సిలర్లు బుధవారం ధర్నాకు దిగారు. వీరికి వైసీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ జయచంద్రారెడ్డి మద్దతు పలికారు. అధికారపార్టీకి చెందిన తనకే అధికారులు పలకడం లేదని ఎన్నిసార్లు ప్రజా సమస్యలపై మొరపెట్టినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల చెత్త పేరుకుపోయిందన్నారు. వాటిని తొలగించేందుకు వాహనాలకు సక్రమంగా డీజిల్ పట్టించడం లేదన్నారు. చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెడ్డపేరు తీసుకురావాలన్న ఉద్దేశంతో అధికారులు ప్రవరిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి మున్సిపాలిటీగా పేరుగాంచిన తాడిపత్రిలో వాహనాలకు డీజిల్ పట్టించలేని స్థితిలో అధికారులు ఉన్నారా అని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, కౌన్సిలర్లు విజయ్‌కుమార్, రేష్మాపర్వీన్, అరుణ, లక్ష్మీదేవి ఉన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి


కణేకల్లులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువత

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 14: పుల్వామా ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది అమర జవాన్ల త్యాగాలు మరువలేనివని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులను వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి జి ప్రకాష్, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, అధ్యాపకులు డీ వెంకటేశ్వర్లు, నటరాజ్, రాకేష్, కృష్ణానంద, అమీర్, నాగార్జున, శ్రావణి, సుభాషిణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: పుల్వామా దాడి ఘటనలో అమరులైన వీర జవాన్ల చిత్రపటం వద్ద బుధవారం ఖాదీ ఇండియా సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఖాదీ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణరావు , విశాలాక్షి ఖాదీ సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణస్వామి, శేఖర్, లక్ష్మీనారాయణ, తిరుమలేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: పుల్వామా దాడిలో అసువులు బాసిన అమరవీరులను స్మరిస్తూ మండల కేంద్రంలోని ఉరవకొండ రోడ్డులో యువతతో పాటు లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి పురవీధులలో కొవ్వొత్తులను చేతపట్టుకుని జైజవాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేట్ స్కూల్ బస్సు



ప్రమాదానికి గురైన స్కూల్ బస్సు

ఉరవకొండ, ఫిబ్రవరి 14: మండలంలోని షేక్షానుపల్లి సమీపంలో ఓ ప్రైవేట్ స్కూల్‌బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే విద్యార్థులు గాయాలు లేకుండా బయటపడ్డారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు జరుట్లరాంపురం నుంచి 20మంది విద్యార్థులను ఎక్కించుకుని ఉరవకొండలోని పాఠశాలకు బయలుదేరింది. షేక్షానుపల్లి సమీపం వద్ద స్టీరింగ్‌రాడ్ విరిగిపోవడంతో బస్సు అదుపు రహదారి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. రోడ్డు పక్కనే మట్టి దిబ్బలు ఉండటంతో బస్సు బోల్తా పడకుండా ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఒక విద్యార్థికి గాయాలు కాగా, మిగిలిన విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. కండీషన్‌లేని బస్సులను నడపడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగిపై కేసు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 14: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగిపై దురుసుగా ప్రవర్తించినందుకు తోటి ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ హరినాథ్ బుధవారం తెలిపారు. ఆ మహిళా ఉద్యోగి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కార్యాలయానికి వెళ్లి పూర్తిస్థాయి లో విచారణ చేశామన్నారు. మహిళా ఉద్యోగిపై దురుసుగా ప్రవర్తిస్తూ, ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ నేపథ్యంలో దురుసుగా ప్రవర్తించిన ఉద్యోగిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ.. డబ్బులకు అమ్ముడుపోయే పార్టీ కాదు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 14: తెలుగుదేశం పార్టీ డబ్బులకు అమ్ముడుపోయే పార్టీ కాదని ఆ పార్టీ మండల కన్వీనర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే ఉన్నం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓ బడా కాంట్రాక్టర్ మున్సిపాల్టీలో టికెట్టు తమకే ఖరారు అయిందంటూ పార్టీకి కూడా రూ. వంద కోట్లు ఇచ్చామంటూ హల్‌చల్ చేయడం దారుణమన్నారు. టీడీపీలో సభ్యత్వం లేని వ్యక్తులు ఇలా చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గోళ్ల వెంకటేశులు, గాజుల శ్రీరాములు, రామాంజినేయులు, గౌని శ్రీనివాసరెడ్డి, గురు, ఆవుల తిప్పేస్వామి, తిప్పారెడ్డి, గోర్ల గోవిందరాజులు, మల్లిపల్లి నారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.